
06


TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :71 గురువారం 11 జూన్ 2026 వేల : 5/-

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad


06

## కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...

# వేలకోట్ల కుంభకోణాలు



- పుష్కర కాలంలో అనేక మార్పులు తీసుకుని వచ్చాం
- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- 2014కు ముందు..ఇప్పడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్ల ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం

**న్యూఢిల్లీ,జూన్ 10 ( హైదరాబాద్ మిర్రర్ ):**

కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు.



## ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

### మోడీకి అభినందనలు

### తెలిపిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):**

ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలు రాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు.

## 43కోటి మంది మహిళలను

# కోటీశ్వరులను చేస్తాం

### మహిళా సంఘాలకు మరో 3 వేల బస్సులు:

### సీఎం రేవంత్

**హైదరాబాద్( హైదరాబాద్ మిర్రర్ )**



రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే వరకు ప్రభుత్వం విశ్రమించదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా శక్తి పథకం కింద ఇప్పటికే ఆర్టీసీకి అప్పగించిన 553 బస్సులకు అదనంగా మరో 3 వేల బస్సులను మహిళా సంఘాల ద్వారా అద్దె ప్రాతిపదికన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు అప్పగిస్తామని ప్రకటించారు.సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాల యాజమాన్యంలోని 553 బస్సుల నిర్వహణను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు అప్పగిస్తూ బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో

# ఓటమి తప్పదు

### తెలంగాణలో ఇక బిజెపిదే తదుపరి అధికారం

### బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ జోస్యం

**భువనగిరి,జూన్ 10 ( హైదరాబాద్ మిర్రర్ ):**



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి ఘోర ఓటమి తప్పదని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి చదువు రాదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం భువనగిరిలో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌పై ఈ రాష్ట్రంలో కేసు ఉన్నట్లు ఎన్నికల సంఘానికి ఎలా తెలిసిందంటూ సందేహం వ్యక్తం చేశారు. ఇది రేవంత్ రెడ్డి కుట్రో, కాంగ్రెస్ పార్టీ కుట్రో వాళ్లే తెలుసుకోవాల్సి ఉందని బీజేపీ ఎంపీ అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండడం సహజమన్నారు. నరేంద్రమోదీ చరిష్మాను ఓట్లుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ విఫలమైందని విమర్శించారు. అక్రమ ఇసుక రవాణాకు లారీలు దొరుకుతున్నాయి.. కానీ ధాన్యం రవాణాకు దొరకడం లేదా? అంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కంటే తెలంగాణలో బీజేపీ విజయం సాధించడం సులభమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి 32 లక్షల టన్నుల బియ్యం బకాయిగా ఉందని చెప్పారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్షం లేదన్నారు. కానీ నేడు చాలా ప్రతిపక్షాలు ఉన్న సమయంలో 12 ఏళ్ల పాటు మోదీ ప్రధానిగా ఉన్నారని ఎంపీ అర్వింద్ వివరించారు.



# పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

### గిరిజన హక్కుల పరిరక్షణకు చట్టం కీలకం

### పీసా చట్టంపై వర్క్‌షాపు ప్రారంభించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూన్ 10 ( హైదరాబాద్ మిర్రర్ ):**

పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు.




## భారతీరాజా భౌతిక కాయం వద్ద

# సిఎం విజయ్ నివాళి

### అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం

**చెన్నై,జూన్10( హైదరాబాద్ మిర్రర్ )**



దర్శకుడు భారతీరాజాకు సిఎం విజయ్ నివాళి అర్పించారు. భారతీరాజా నివాసానికి వెళ్లిన సిఎం ఆయన భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమిళ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలను గుర్తు చేశారు. అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించారు. తమిళ చలనచిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అంతకుముందు, తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తమ వ్యవస్థాపకుడు, దిగ్గజ దర్శకుడైన భారతీరాజా తుది వీడ్కోలుకు ప్రభుత్వ అధికారిక లాంఛనాలను కల్పించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది.

## రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ


# ప్రధాన లక్ష్యం



- 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి
- జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాల పూర్తి
- సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్ల సిద్ధం
- నవంబర్-డిసెంబర్‌లో పునరుద్ధరణ పనుల ప్రారంభం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మేడిగడ్డ,జూన్ 10 ( హైదరాబాద్ మిర్రర్ ):**

మెడిగడ్డ బ్యారేజ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు మరియు పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామని చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు.



## మోడీకి వివిధ దేశాల నేతల అభినందనలు

### ఎక్స్ వేదికగా విషెస్

### తెలిపిన మెలోనియా

**న్యూఢిల్లీ,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):**

ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ దేశాధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



## ఘనా పారిశ్రామికాభివృద్ధికి

# 'తెలంగాణ' మార్గనిర్దేశం

### 'ఫార్మా హబ్' ఏర్పాటుకు

### పూర్తిస్థాయి సహకారం

### ఘనా ఉన్నత స్థాయి బృందంతో

### మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జూన్ 10 ( హైదరాబాద్ మిర్రర్ ):**

రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ-ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలెప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు.

మొదటిపేజీ తరువాయి

## రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

హైడ్రాలజికల్ అధ్యయనాలతో పాటు జియోటెక్నికల్ బోర్‌హోల్ పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో ఉఖీ పరీక్షలు 90 శాతం వరకు పూర్తయ్యాయని, బోర్‌హోల్ మరియు జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలకుల తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట విధానాలు, నిర్మాణ లోపాల కారణంగానే మెడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2023 అక్టోబర్‌లో జరిగిన నష్టం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అనంతరం నిర్వహించిన విచారణల్లో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, న్యాయ కమిషన్ పలు నిర్మాణ, డిజైన్, నిర్వహణ లోపాలను గుర్తించాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,000 కోట్ల అంచనా వ్యయంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. 2014 నాటికే దాదాపు మూడోవంతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. అదే ప్రాజెక్టును కొనసాగించి ఉంటే 2016–17 నాటికే పూర్తయి సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు.అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ–డిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని విమర్శించారు. రూ.38,000 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం లక్ష కోట్ల రూపాయలు దాటిందని, కాగ్ అంచనాల ప్రకారం అది రూ.1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇంత భారీ ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల తెలంగాణ ప్రజలపై, రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడిందని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు. ÷ఎనరుద్ధరణ డిజైన్ల కోసం ప్రపంచ ప్రఖ్యాత కన్సల్టెంట్ సంస్థ , ఐఐటీ బొంబాయితో కలిసి నియమించామని ఆయన తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నమూనా అధ్యయనాలు, సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణులను కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. ఎన్‌డీఎస్ఏ గుర్తించిన స్కౌర్ డెప్త్, కట్–ఆఫ్ డెప్త్, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్, ఎనర్జీ డిసిపేషన్, గేట్ల నిర్వహణ వంటి కీలక అంశాలపై సమగ్ర అధ్యయనాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలతో పాటు ప్రాజెక్టుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది, శాశ్వత భద్రతా ప్రమాణాలతో మెడిగడ్డతో పాటు అన్ని బ్యారేజీలను పునరుద్ధరిస్తాం. తెలంగాణ రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ప్రాజెక్టులను తిరిగి సురక్షితంగా, సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకువస్తాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు.

మొదటిపేజీ తరువాయి

## మోడీకి వివిధ దేశాల నేతల అభినందనలు

### ఎక్స్ వేదికగా విషెస్ తెలిపిన మెలోనియా

న్యూఢిల్లీ,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):

ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ దేశాధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరుదేశాల మధ్య బలపడుతోన్న సంబంధాలను ప్రస్తావిస్తూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీకి నా అభినందనలు. ఇటీవల రోమ్‌లో మళ్లీ మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. ఇరుదేశాల ప్రజల కోసం కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ఒక ప్రత్యేకమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సంయుక్తంగా ప్రారంభించడం కూడా మంచి విషయం' అని మెలోనీ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కలిసి ఉన్న ఫొటోను ఆమె పంచుకున్నారు. 'భారత్‌లో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన ప్రధాని మోదీకి అభినందనలు. ఈ ఘనత ఆయన దశాబ్దాల ప్రజాసేవకు, నాయకత్వానికి ఒక శక్తిమంతమైన నిదర్శనం' అని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. చారిత్రక మైలురాయికి చేరుకున్న ప్రధాని మోదీకి అభినందనలు. భారతదేశ అభివృద్ధి, శ్రేయస్సు, ప్రపంచ వేదికపై దాని స్థానాన్ని పెంపొందించడంలో ఆయన ఎంతో కృషి చేశారు. భారత్‌తో ఉన్న సన్నిహిత, సుదీర్ఘ స్నేహాన్ని మలేషియా గౌరవిస్తోంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు మన ప్రజలకు అవకాశాలను విస్తరించడంలో సహకారాన్ని కొనసాగించేం దుకు నేను ఎదురుచూస్తున్నా. మోదీ ఇలాంటి మరెన్నో ఘనతలు సాధించాలని.. భారత ప్రజలు శాంతి, శ్రేయస్సులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా అంటూ మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం అభినందనలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

## కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...

ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు.


తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు.సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తేలిపోయిందని అన్నారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్–370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

### నెహ్రూ రికార్డును తిరగరాసిని మోడీ

న్యూఢిల్లీ,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):

నరేంద్ర మోదీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరఫున రెండు సార్లు పూర్తికాలపు ప్రధానిగా పదేళ్లు పనిచేసి రికార్డు సాధించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనున్నారు. ఈ రకంగా ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును నేటితో మోదీ తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. మోదీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పదవిలో వరుసగా మూడోసారి కొనసాగుతున్నారు. బుధవారం తో ఆయన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు వరుసగా 4,398 రోజులు పని చేశారు. ఎన్నికైన తర్వాత వరుసగా అత్యధిక కాలం భారత ప్రధానిగా కొనసాగిన వారి జాబితాలో ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులు పదవిలో ఉన్నారు.



మొదటిపేజీ తరువాయి

## 43కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ. ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది సభ్యులున్నారని, ఆ సంఖ్యను కోటి మందికి పెంచాలని పిలుపునిచ్చారు. "కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే బాధ్యత నాది" అని పేర్కొన్నారు. 2034 నాటికి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.మహిళా సంఘాలు స్థానికంగా వ్యాపార ప్రణాళికలు రూపొందించుకోవాలని, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో త్వరలో పర్యటిస్తానని సీఎం వెల్లడించారు. మహిళా శక్తికి ఈ ప్రభుత్వంలో ప్రత్యేక స్థానం ఉందని స్పష్టం చేశారు.రైతులు లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, వరి, మొక్కజొన్నలతో పాటు కందులు, మినుములు, పెసర్లు, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. పంటల మార్పిడి, రైతుల్లో అవగాహన కల్పించే బాధ్యతను మహిళా సంఘాలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు రూ.2,400 కోట్లతో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు.ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరిటే మంజూరు చేస్తున్నామని, పట్టణాల్లో నిర్మించనున్న లక్ష ఇళ్లను కూడా మహిళల పేరుతోనే ఇస్తామని సీఎం ప్రకటించారు. మహిళల పర్యవేక్షణలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ప్రభుత్వం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లకు పైగా చెల్లించినట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలోని 27 వేల పాఠశాలల నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో మహిళలకు అప్పగించినట్లు చెప్పారు.మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి మహిళా సంఘాలు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల స్త్రీశక్తి భవనాలను ప్రారంభించామని, భవిష్యత్తులో జిల్లా కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో మహిళా శక్తి భవనాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.స్వయం సహాయక సంఘాలకు రూ.61 వేల కోట్ల బ్యాంకు అనుసంధానం కల్పించడంతో పాటు సున్నా వడ్డీ రుణాల కోసం రూ.2 వేల కోట్లు బ్యాంకులకు చెల్లించినట్లు సీఎం వెల్లడించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి, మహాలక్ష్మి పథకాల కింద స్వయం సహాయక సమాఖ్యలు, మండల మహిళా సమాఖ్యలకు చెక్కులను అందజేశారు. ఆర్టీసీకి అప్పగించిన బస్సులపై అద్దె రూపంలో రూ.20.34 కోట్ల చెక్కు,మహిళల ఉచిత ప్రయాణం కింద ఆదా చేసిన రూ.10,700 కోట్లు, వడ్డీ లేని రుణ పథకం కింద రూ.500 కోట్ల చెక్కులను అందించారు.

మొదటిపేజీ తరువాయి

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

మొదటిపేజీ తరువాయి

## భారతీరాజా భౌతిక కాయం వద్ద సిఎం విజయ్ నివాళి

అసోసియేషన్ అభ్యర్థనకు స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు. ఈ సందర్భంగా తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రభావవంతమైన, విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన మహోన్నత వ్యక్తి భారతీరాజా అని కొనియాడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకున్న ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' (2004) పురస్కారంతో పాటు 6 జాతీయ చలనచిత్ర అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులను మరియు మరెన్నో ప్రశంసలను ఆయన అందుకున్నారని గుర్తుచేసింది. భారతీయ సినిమాకు ఆయన అందించిన సహకారం అసమానమైనదని, ఒక దర్శకుడిగా ఎన్నో కాలాతీత క్లాసిక్ చిత్రాలను సృష్టించడమే కాకుండా, నటుడిగానూ తన అద్భుత నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని ప్రశంసించింది. 2020లో పలువురు నిర్మాతలతో కలిసి భారతీరాజా 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' ను స్థాపించారని, ఆయన దూరదృష్టితో కూడిన నాయకత్వంలో ఈ అసోసియేషన్ స్థిరంగా వృద్ధి చెంది ప్రస్తుతం 400 మందికి పైగా క్రియాశీల నిర్మాతలకు ప్రాతినిధ్యం వహిస్తోందని సంస్థ తెలిపింది. నిర్మాతలు, దర్శకులు, నటుల సంక్షేమం కోసం మరియు తమిళ సినిమా సమగ్ర అభివృద్ధి కోసం ఆయన ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేశారని, అసోసియేషన్ చేపట్టే ప్రతి కార్యక్రమానికి ఆయన నిరంతరం మద్దతుగా నిలిచారని ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తమ ప్రకటనలో కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంది.



# రైతులకు జిలుగు విత్తనాలు పంపిణీ చేసిన,సర్పంచ్, ఏఈఓ

## రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించాలి

**మునుగోడు, జూన్ 10 హైదరాబాద్ మిర్రర్ :**

మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (గ్రాజా) కార్యాలయంలో బుధవారం రైతులకు జిలుగు విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యి ఏఈఓ నేతాజీతో కలిసి రైతులకు విత్తనాలు అందజేశారు.భూసారాన్ని పెంచడానికి జిలుగు విత్తనాలు దోహదపడతాయాన్ని,ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించాలని సర్పంచ్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామల, సీఈఓ పాలకూరి సుఖేందర్,వార్డు సభ్యులు బీమనపల్లి పవిత్ర కిరణ్,నన్నూరి అశోక్ రెడ్డి,మహేష్,స్వామి,లింగస్వామి,శ్రీకాంత్,, రైతులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

## మునుగోడులో ఘనంగా గ్రామసభ నిర్వహణ

**మునుగోడు, జూన్ 10:**

మునుగోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఓ విజయభాస్కర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన మరియు రాబోయే కాలంలో చేపట్టాల్సిన ప్రణాళికల గురించి సభకు వివరించారు. గ్రామ సమస్యల పరిష్కారానికి మరియు సంక్షేమ పథకాల అమలుకు తమ పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆమె తెలిపారు.
ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారంపై అధికారులు సానుకూలంగా స్పందించారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం

**సంస్థాన్ నారాయణపురం జూన్ 10(హైదరాబాద్ మిర్రర్)::**

యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని చిమిర్యాల గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చిమిర్యాల గ్రామ మాజీ సర్పంచ్ దొనూరి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మల్లేపల్లి మోహన్ రెడ్డికి 60,000, మల్లేపల్లి బాలమణికి 55,000, సుర్వి పద్మ--శంకరయ్యలకు 23,500, దామ ముత్యాలుకి 60,000,ముద్దంగుల ముత్తమ్మకి 11,000, సూర్వీ వెంకటయ్యకి 18,000, రూపాయలు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దొనూరి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఆరోగ్య అవసరాల నిమిత్తం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఇలాంటి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చిమిర్యాల గ్రామ ఉప సర్పంచ్ ఉప్పుల అండాలు యాదయ్య, వార్డు సభ్యులు దామ మల్లేష్ ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కేశాని దిలీప్, కేశాని రాజు,సూర్వి ముత్యాలు, మర్రి ఇస్తారి, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడిలోనే విద్యార్థుల భవిష్యత్తుకు పూల బాటలు

## -నూతన పాలకవర్గ ప్రోత్సాహం అభినందనీయం

## -ప్రధానోపాధ్యాయులు శోభా రాణి,నిరంజన్ రెడ్డి

**చౌటుప్పల్,జూన్ 10, హైదరాబాద్ మిర్రర్ :**

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి తామంతా కట్టుబడి ఉన్నట్లు ప్రధానోపాధ్యాయులు శోభారాణి, నిరంజన్ రెడ్డి లు తెలిపారు. బుధవారం పీపల్ పహాడ్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు.క్రమం తప్పకుండా రోజూ బడి బాట కార్యక్రమం నిర్వహించటం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ముప్పై సంవత్సరాలుగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులని చేర్పించాలని ఇంతగా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు గడప గడపకు తిరగడం చూసి తల్లిదండ్రులు ప్రభుత్వ విద్య పట్ల విశ్వసాన్ని వ్యక్తపరుస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కూడా తోడై గడప గడపా తిరగడం విశేషం. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులనాగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్, వార్డు సభ్యులు ఎర్ర సువర్ణ అంజయ్య, బద్దం సుధాకర్ రెడ్డి, ఎర్ర పూజా పరమేష్, ఉపాధ్యాయులు, ఉమాదేవి, శ్రీదేవి, సురేష్, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, కారోబార్ దానయ్య, గ్రామ పెద్దలు రోషణగారి మల్లయ్య, చీర్క రంగారెడ్డి, బకనగారి బుచ్చయ్య, ఎర్ర యాదయ్య, కామిశెట్టి అభిలాష్, కావ్య తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తాం

-బెల్టు షాపుల నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలి...

-రోడ్లపై, మురికి కాలువలలో చెత్త వేస్తే భారీ జరిమానా...

-చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్

-మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్

**చౌటుప్పల్,జూన్ 10, హైదరాబాద్ మిర్రర్:**



అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ అన్నారు.పట్టణంలో 'ప్రజా పాలన ప్రగతిక ప్రణాళిక' - 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం 5,6,14,15 వార్డులలో వార్డు సభలను వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సభలకు మున్సిపల్ చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్,మున్సిపల్ కమిషనర్ యన్. వెంకటేశ్వర నాయక్ లచే కార్యక్రమాలు నిర్వహించారు. దిగ్వి జయంగా సాగాయి.ఈ సందర్భంగా లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, రెవిన్యూ డిపార్ట్మెంట్ నుంచి ఎం ఆర్ ఓ వీరాబాయి, పోలీస్ శాఖ నుంచి ఎస్ఐ రవీందర్, వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఏ.ఈ సతీష్ పాల్గొని ఇందిరమ్మ ఇండ్లు,పెన్షన్లు,గృహ జ్యోతి, చెత్త సేకరణ, మురికి కాలువల నిర్వహణ, ఘన వ్యర్థ పదార్థాల సేకరణ, విద్యుత్,వ్యవసాయం, వైద్యం, విద్య, ప్రజా పరిపాలన వంటి తదితర అంశాలపై ప్రజలకు కూలంకషంగా వివరించారు.

**అందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా:మున్సిపల్ చైర్ పర్సన్**

అందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతిష్టాత్మక పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్క పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డుల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ప్రజా సమస్యలను వార్డు సభలలో వివిధ అధికారుల సమక్షంలో నిర్వహించి ప్రజలు తెలపడం వలన వారి వారి సమస్యలు 100% పరిష్కారమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలందరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమాలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ మోడల్ సిటీగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. బడుగు,బలహీన వర్గాల కుటుంబాలు క్షేమంగా ఉండాలని బెల్టు షాపుల నిర్మూలనకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని దీనికి అందరూ సహకరించాలని ఆమె కోరారు.

**చెత్తను రోడ్లపై వేస్తే భారీ జరిమానా తప్పదు :మున్సిపల్ కమిషనర్**

"ప్రజలు తమ ఇళ్లలో చేరిన చెత్తను మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ప్రజలకు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల వెంట, మురికి కాలువల్లో చెత్త వేస్తే పరిసరాలు అపరిశుభ్రమై అనేక రోగాల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు.నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై చెత్త వేసే వారికి 500 నుండి 5000 రూపాయల వరకు భారీ జరిమానా విధి స్తామని హెచ్చరించారు. వర్షాకాలం /సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి హెల్త్ అసిస్టెంట్ ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, ఉడుగు జ్యోతి రమేష్, గడ్డం ఇంద్ర రాజారత్నం,ఆలే శ్రీలత చిరంజీవి, మున్సిపల్ అధికారులు మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, వార్డు ఆఫీసర్లు,వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 10(హైదరాబాద్ మిర్రర్):**

సంస్థాన్ నారాయణపురం మండలం లింగ వారిగూడెం కు చెందిన చిట్యాల సత్తిరెడ్డి (77) మరణించడంతో అతని కుమార్తె సరళ తండ్రి కి తలకొరివి పెట్టారు. సత్తిరెడ్డి గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతనికి కుమారులు లేకపోవడంతో అంత్యక్రియలను ఏకైక కుమార్తె పల్లె సరళ శాస్త్రోక్తంగా బుధవారం నిర్వహించారు. సత్తిరెడ్డి మృతికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన పార్థివ దేహం పై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఉజ్జిని యాదగిరి రావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# పరిశ్రమల్లో ప్లాస్టిక్ వినియోగం తగ్గింపుపై అవగాహన శిబిరం



**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 10:**

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంగారెడ్డి ఆధ్వర్యంలో ఐలా, పటాన్‌చెరు సమావేశ మందిరంలో పరిశ్రమల సంఘాలు, పరిశ్రమల ప్రతినిధులతో కలిసి "99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా శిక్షణ శిబిరం నిర్వహించారు. పరిశ్రమల్లో ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, స్థిరమైన పారిశ్రామిక ఆచరణలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త ప్రధాన పర్యావరణ ఇంజనీర్ కె. శ్రీనివాస రెడ్డి, సీనియర్ పర్యావరణ ఇంజనీర్ బి.వి. భద్ర గిరీశ్, పర్యావరణ ఇంజనీర్లు కుమార్ పాఠక్, ఎన్. విజయలక్ష్మి, మాధురి, ఐలా చైర్మన్ దుర్గ ప్రసాద్ ప్రసంగించారు. పర్యావరణ చట్టాల అమలు, వాతావరణ మార్పుల సవాళ్లు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల ప్రాముఖ్యత, చక్రాకార ఆర్థిక వ్యవస్థ, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ నిర్మూలన, వ్యర్థాల వర్గీకరణ, స్వీయ నియంత్రణ చర్యలు, సామూహిక సదుపాయాల అవసరం, పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమల పాత్ర వంటి అంశాలపై వివరించారు. అధికారులు పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటించడంతో పాటు వ్యర్థాలను సరైన విధంగా వర్గీకరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. జేకే ఫెన్నర్ లిమిటెడ్, సెఖ్మెట్ ఫార్మావెంచర్స్, న్యూలాండ్ లాబొరేటరీస్ ప్రతినిధులు పర్యావరణ--సామాజిక--పాలనా విధానాలు, సంస్థల పర్యావరణ బాధ్యత, ప్లాస్టిక్ తగ్గింపు చర్యలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు.సుమారు 80 మంది పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు పరిశ్రమలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# బిఆర్ఎస్ నేత కెటిఆర్ సంతాపం

**హైదరాబాద్,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):**

కోలీవుడ్ దర్శక దిగ్గజం భారతీరాజా మృతిపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం ఎంతో కలిచివేసిందని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. భారతీయ సినిమాను వినూత్న మార్గంలో నడిపించిన మహోన్నత కళాకారుడు భారతీరాజా అని కేటీఆర్ కొనియాడారు. ఆయన రూపొందించిన సినిమాలు తరతరాలపాటు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతాయని అన్నారు. భారతీరాజా మరణం తమిళ సినీపరిశ్రమే కాకుండా భారతీయ సినిమాకు తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. ఆయన కుటుంబ సభ్యులకు, సినీ పరిశ్రమకు చెందిన సహచరులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారతీరాజా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# గంజాయి నిర్మూలనకు పోలీసుల ఉక్కుపాదం.. రామకృష్ణాపూర్‌లో ముమ్మర తనిఖీలు

## నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేక సోదాలు -- గంజాయి సేవన,విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న ఎస్ఐ శ్రీధర్



**రామకృష్ణాపూర్,జూన్ 10 :హైదరాబాద్ మిర్రర్**

గంజాయి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనర్, డీసీపీల ఆదేశాల మేరకు గంజాయి సేవించేవారు, విక్రయించేవారిపై వచ్చిన ముందస్తు సమాచారం ఆధారంగా అనుమానితుల ఇళ్లలో విస్తృత సోదాలు నిర్వహించారు.తనిఖీల్లో భాగంగా నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌ను ప్రత్యేకంగా రంగంలోకి దించారు.గంజాయిని ఎక్కడ దాచి ఉంచినా డాగ్ స్క్వాడ్ సహాయంతో సులభంగా గుర్తించవచ్చని పట్టణ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.రామకృష్ణాపూర్ పరిధిలో గంజాయి సేవించడం, విక్రయించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు వెంటనే అలాంటి అలవాట్లను విరమించుకోవాలని హెచ్చరించారు.లేనిపక్షంలో చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం గంజాయి మహమ్మారిని పూర్తిగా అరికట్టేందుకు 'ఈగల్ ' పేరుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందని,ఈ బృందం నిరంతరం నిఘా కొనసాగిస్తూ గంజాయి రహిత సమాజం కోసం కృషి చేస్తోందని ఎస్ఐ పేర్కొన్నారు.తమ ప్రాంతంలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నా,గంజాయి సేవిస్తున్న వారి గురించి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని, గంజాయి నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని రామకృష్ణాపూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఫసల్వాది లో డీజీపీ భగవత్ రోడ్డు భద్రత అవగాహన సభ

- నో హెల్మెట్ -- నో ఎంట్రీ' అమలు చేస్తాం: సర్పంచ్

- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ: ఎస్పీ

- సురక్షిత ప్రయాణమే 'ఆరైవ్ అలైవ్' లక్ష్యం: కలెక్టర్

- హెల్మెట్ ప్రాణరక్షణ కవచం : డీజీపీ భగవత్

- మద్యం సేవించి వాహనం నడపొద్దు: డీజీపీ హెచ్చరిక

- గ్రామస్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ, హెల్మెట్ల పంపిణీ

- గమ్యానికి చేరడం కంటే సురక్షితంగా చేరడమే ముఖ్యం: డీజీపీ

- ఫసల్వాడి గ్రామ సభలో డీజీపీ - భగవత్ -- రోడ్డు భద్రతపై 'ఆరైవ్ అలైవ్' సందేశం

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 10:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఫసల్వాది గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ లా అండ్ ఆర్డర్, మహేష్ మురళీధర్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరై రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామంలో "నో హెల్మెట్ – – నో ఎంట్రీ" విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి 'ఆరైవ్ అలైవ్' కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలకు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించి పరిమిత వేగంతో ప్రయాణించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవడమే 'ఆరైవ్ అలైవ్' కార్యక్రమం లక్ష్యమన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తుందని హెచ్చరించారు. డీజీపీ మహేష్ మురళీధర్ భగవత్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొబైల్ ఫోన్‌కు



రక్షణ కల్పించినట్లే తమ ప్రాణాలకు రక్షణగా హెల్మెట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, కార్లలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్ ధరించాలని చెప్పారు. పండుగల సందర్భంగా బహుమతులుగా హెల్మెట్లు ఇవ్వడం మంచి సంప్రదాయంగా మారాలని సూచించారు. "గమ్యస్థానానికి చేరుకోవడం ముఖ్యమే, కానీ సురక్షితంగా చేరుకోవడం మరింత ముఖ్యమైనది" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని డీజీపీ పేర్కొన్నారు. అనంతరం గ్రామస్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎంహెచ్‌వో లలిత, ఆర్డీవో రాజేందర్, రవాణా శాఖ జాయింట్ కమిషనర్ వెంకటరమణ, డీఎస్పీ సత్యయ్య గౌడ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి: మాద్రి పృథ్వీరాజ్

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 10:**

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బూత్ స్థాయి నుంచి విస్తృతంగా నిర్వహించి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నాయకుడు హరీష్ రావు ఆదేశాల మేరకు పటాన్‌చెరు పట్టణంలోని పీవీ నరసింహ ఆడిటోరియంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై దిశానిర్దేశ సమావేశం నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్, గూడెం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌కు ఇద్దరు యువ కార్యకర్తలు, ఒక బూత్ బాధ్యుడిని నియమించి డిజిటల్ సభ్యత్వ నమోదు యాప్ ద్వారా అధిక సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేయాలని సూచించారు. యువత, సీనియర్ సమన్వయకర్తల సహకారంతో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టాలని కోరారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ బలోపేతానికి వేదికగా మలచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, నర్రా భిక్షపతి, శ్రీధర్ చారి, వంగారి అశోక్, చందు, గుండమొల్ల రాజు, కోమరగూడెం వెంకటేష్, నవీన్ రెడ్డి, శంకర్, షకీల్ తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఎంఫీఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు

వృద్ధులను సన్మానించి చీరలు పంపిణీ చేసిన ఎండి రహీం షరీఫ్

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 10(హైదరాబాద్ మిర్రర్ ):**

యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలను మునుగోడు నియోజకవర్గం ముస్లిం మైనార్టీ నాయకుడు ఎండి రహీం షరీఫ్ ఘనంగా నిర్వహించడం జరిగింది అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులను సన్మానించి చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎం,డి రహీం షరీఫ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ల కొరకు నిరంతరం పోరాటం చేస్తూ ప్రభుత్వాల నుండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న వ్యక్తి జాజుల శ్రీనివాస్ గౌడ్ అని అన్నారు.రాబోయే రోజులలో శ్రీనివాస్ గౌడ్ అత్యున్నత పదవులు పొందాలని ప్రజా సంక్షేమం కోసం పోరాడాలని ఆయన చేస్తున్న ఉద్యమానికి బడుగు బలహీన వర్గాలు బీసీ సంఘం నాయకులకు నా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు.



## నాలా పనులు నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలి : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్పేట్ సర్కిల్, మీర్‌పేట్ డివిజన్‌లో ఉన్న మిథిలా నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా అభివృద్ధి పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. నాలా పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టిని తొలగించి వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఈనెల 20, 21, 22 తేదీలలో మహబూబ్ నగర్ నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా

**భువనగిరి,జూన్ 10(హైదరాబాద్ మిర్రర్):**

ఈనెల 20, 21, 22 తేదీలలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు జెల్లెల్ల పెంటయ్య అధ్యక్షతన జరగగా సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కూలీల హక్కుల కోసం, భూమి కోసం , కూలీ రేట్ల పెంపు కోసం, సంక్షేమ పథకాల అమలు కోసం, విద్య వైద్యం కోసం నిరంతరం అనేక సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ కూలీలకు, పేదలకు అండగా నిలబడుతుందని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కోసం ఉద్యమాలు చేసి వాటిని సాధించుకున్న ఘనచరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానిదే అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చినంక చట్టాన్ని నిర్వీర్యం చేసి ఉపాధి హామీ కార్మికుల పొట్టలు కొడుతూ విబి – జిరాంజీ చట్టాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. మోడీ తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని కూడా పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహబూబ్ నగర్లో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలలో వ్యవసాయ కార్మికుల, పేదల సంక్షేమం గురించి చర్చించి కూలీ, భూమి పోరాటాలను రూపొందిస్తామని తెలిపారు. 20వ తేదీన మధ్యాహ్నం భారీ బహిరంగ సభ కూడా నిర్వహిస్తున్నామని ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్, ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు జి. నాగయ్య , ఆర్. వెంకట్రాములు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ బహిరంగ సభలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు, పేదలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, గంగాదేవి సైదులు , జిల్లా ఉపాధ్యక్షులు సిరిపంగి స్వామి , గుంటోజి శ్రీనివాస్ చారి, సహాయ కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, జిల్లా కమిటీ సభ్యులు బొడ్డు కిషన్, దొడ్డి బిక్షపతి, బోయ యాదయ్య, వల్లంబట్ల శ్రీనివాసరావు, కొండపురం యాదగిరి, మానే సాలయ్య, చింతకాయల నరసింహ, అందెల జ్యోతి, చెక్కిళ్ల ఉపేంద్ర, గ్యార అండాలు, చింతల సుదర్శన్, యాట బాలరాజు, కందుల హనుమంతు, మేడి ముకుందం, గాజుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు




## కాలనీ సమస్యలు తీర్చాలంటూ ఎమ్మెల్యేకి వినతిపత్రం

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

తమ కాలనీలో నెలకొన్న రోడ్డు సమస్యలను మరియు కాలనీలోని పార్కులు అభివృద్ధి చేయాలంటూ గుర్రం గూడా లోని శ్రీశ్రీ అవెన్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పొదిల గోవర్ధన్ ఆధ్వర్యంలో కాలనీవాసులంతా మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో నెలకొన్న సమస్యలు వెంటనే తీర్చాలంటూ జోనల్ కమిషనర్ కి సూచించడం జరిగింది.



## ప్రజా పాలన - ప్రగతి నివేదిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ సభ నిర్వహణ

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 10(హైదరాబాద్ మిర్రర్ )**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల అల్లందేవిచెరువు గ్రామంలో ప్రజా పాలన -- ప్రగతి నివేదిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ,ఎంఈఓ, వివిధ శాఖల ఏఈలు, ఉపాధి హామీ ఏపీవో ప్రశాంతి , ఆరోగ్య శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు పోలీసు శాఖ అధికారులు మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలు, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై గ్రామ ప్రజలకు సమగ్రంగా వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముక్కర్ల కవిత స్వామి యాదవ్,వార్డు సభ్యులు వంటల సువర్ణ గణేష్ యాదవ్, అంతటి శివశంకర్ గౌడ్, భవాని లింగారెడ్డి, గ్రామ పెద్దలు అంతటి సురేష్ గౌడ్, సుర్వి రవి గౌడ్, సుర్వి సురేష్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్ సుర్వి ప్రేమలత, సుర్వి లింగస్వామి, గ్రామ సిబ్బంది ఏర్పుల నాగేష్, ఏర్పుల గాలయ్య, ముచ్చర్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు వేదికలుగా ఉపయోగపడతాయని సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ గారు పేర్కొన్నారు.



## వికసిత్ భారత్ లక్ష్యసాధనలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం అవ్వాలి - శ్రీరాములు అందెల

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లెలగూడ డివిజన్ లో ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో డివిజన్ బిజెపి అధ్యక్షులు తులసి ముఖేష్ ముదిరాజ్, పసునూరి బిక్షపతి చారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశ ప్రజలచే ఎన్నికై అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానమంత్రిగా కొనసాగిన రికార్డును సాధించిన నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీర్ఘాయుష్షు, ఆరోగ్యవంతమైన జీవితం భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వేడుకున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. "వికసిత్ భారత్" లక్ష్యసాధనలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని, దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి రాజు, ప్రధాన కార్యదర్శులు సిద్ధల శ్రీనివాస్ వెంకటేశ్వర రెడ్డి ఇంద్రావతి రవి నాయక్, మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పెండ్యాల నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడూరు సోమేశ్వర్, ముత్తంగి కరుణానిధి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.



# ధరల భారం తగ్గించాలి - పేదలకు ఇళ్ల స్థలాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలి

## : సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

## - రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. పేదలకు సబ్సిడీపై రేషన్ సరుకులు అందించాలని, మార్కెట్‌లో నల్లబజారు, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి గృహ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని భూదాన భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న కుటుంబాలకు జనగణన నిర్వహించి, విద్యుత్, మంచినీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే చేవెళ్ల, మహేశ్వరం, కొడ్గూరు, చౌదరిగూడ ప్రాంతాల్లో పేదలకు మంజూరైన ఇళ్ల స్థలాల పట్టాలకు అనుగుణంగా భూములపై



హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని పాలమాకుల జంగయ్య హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడి తమ్ముడి వివాహా వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 10:

హత్నూర మండలంలోని మల్కాపూర్ కె ఎల్ ఎమ్ ఫంక్షన్ హాలులో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మొగులయ్య తమ్ముడు వివాహ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ప్రముఖ రాజకీయ నాయకులు అల్లారం రత్నయ్య, ఎమ్ ఈ ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల నర్సింలు, భూడిద నవాజ్, మైసగల్ల గంగారాం, మాజీ ఎంపిటిసి మీనం పల్లి కిషన్ రావు, తెలంగాణ ఉద్యమకారుడు ఆవుల మల్లేశం, బిఆర్ఎస్ నాయకులు ముక్కిడి రాములు, ఎమ్ఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి గందగల్ల ప్రసాద్, సీనియర్ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త ముక్కగల్ల యాదన్న, బీఎస్పీ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కె. పవన్ కుమార్ తదితర రాజకీయ, సామాజిక, వ్యాపార రంగాల ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఈ వేడుకలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, సామాజిక సేవకులు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు జీవితంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. క్రిస్టియన్ సాంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించిన పెళ్లి కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేయగా, వివాహ వేడుక ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. వివాహం ఇద్దరు వ్యక్తులనే కాకుండా రెండు కుటుంబాల అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. నూతన దంపతులు పరస్పర అవగాహనతో ఆదర్శవంతమైన కుటుంబ జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.



# బూత్ స్థాయి అధికారుల పనితీరుపై ఆర్డీవోకు వినతిపత్రం

## - అవగాహన కలిగిన వారినే నియమించాలని విజ్ఞప్తి

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )

బూత్ స్థాయి అధికారులుగా (బీఎల్ఓ) నియ మించబడిన కొందరు తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదని బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏ-2) పేర్కొంటున్న నేపథ్యంలో, వారిని వెంటనే తొలగించి కొత్త అధికారులను నియమించాలని కోరుతూ ఆర్డీవో శ్రీధర్ గారికి వినతిపత్రం అందజేశారు. కొంతమంది బూత్ స్థాయి అధికారులకు భౌగోళిక గుర్తింపు (మ్యాపింగ్)పై సరైన అవగాహన లేకపోవ డంతో పాటు, విధుల నిర్వహణలో కూడా అనుభవం తక్కువగా ఉందని నాయకులు తెలిపారు. ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ కార్యక్రమం (ఎస్ఐఆర్) ఎంతో కీలకమైన ప్రజాస్వామ్య ప్రక్రియ కావడంతో, ఇందులో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. అందువల్ల పూర్తి అవగాహన, నైపుణ్యం, విద్యార్హతలు కలిగిన వారినే నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్ఐఆర్ కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ ఎస్ఐఆర్ కన్వీనర్ మల్లేష్ యాదవ్, బీజేపీ కార్యాలయ కార్యదర్శి విజయ్ కుమార్, హరి కిషన్ జీ, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్, మల్లేష్ చారి తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీగూడలో తీవ్ర విషాదం..

## అనారోగ్యం తాళలేక వివాహిత ఆత్మహత్య!

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )



అనారోగ్య బాధలు తాళలేక ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్ ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి...శాస్త్రీపురం అన్సారీ రోడ్డుకు చెందిన ఫర్జానా (భర్త దివంగత గఫర్) మూడవ కుమార్తె రేశ్మ బేగం (26)కు, షేక్ ముస్తాఫా (30) అనే వ్యక్తితో మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. వీరు లక్ష్మీగూడలోని ఆర్.జి.కె బిల్డింగ్స్‌లో నివాస ముంటున్నారు. రేశ్మ బేగం గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం (జూన్ 09) రాత్రి 9 గంటల సమయంలో దంపతులిద్దరూ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చారు. అనంతరం భర్త పని నిమిత్తం బయటకు వెళ్లగా, రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో రేశ్మ బేగం తన కుమార్తెను అదే బిల్డింగ్‌లోని మరో పోర్షన్‌లో ఉంటున్న తన అక్కకు ఇచ్చి గదిలోకి వెళ్ళింది. మనస్తాపంతో ఆమె హాల్లోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. గమనించిన రేశ్మ బేగం అక్క, ఆమె కుమారుడు మరియు అంతలోనే అక్కడికి చేరుకున్న భర్త కలిసి రేశ్మను కిందికి దించి, వెంటనే ఆటోలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కి తరలించారు. అయితే, ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ?తీవ్ర అనారోగ్యం కారణంగానే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తల్లి ఫర్జానా బుధవారం (జూన్ 10) ఉదయం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోండి

## : జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )

వర్షాకాలంలో ప్రజలు, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో చేపట్టాల్సిన చర్యలపై బుధవారం రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో హైడ్రా, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రాజెక్టు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నాలాలపై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, జీహెచ్ఎంసీ పరిధికి సంబంధించిన పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. జలమండలికి సంబంధించిన సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుని నీటి నిల్వలను నివారించాలని ఆదేశించారు. ప్రజలు, పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని హెచ్చరించారు.




# వర్షాకాల వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలకు సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ సూచన




గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )

నర్కుడ గ్రామ పంచాయతీ పరిధిలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ ఘనంగా నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పరిశుభ్రత, పారిశు ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త, హానికర చెత్తలను వేర్వేరుగా సేకరించడం, వాటి నిర్వహణలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు వివరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ శ్రీ గడ్డం శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. గ్రామ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొంటూ, 99 రోజుల ప్రణాళికను విజయవంతం చేసి నర్కుడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మున్ని, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్యతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉప సర్పంచ్ నీరటి మహేష్, వార్డు సభ్యులు పర్వతం వెంకటయ్య, చౌట రాజు, తొంట జంగమ్మ, కనకమామిడి విష్ణు, కుంచ లత--కుమార్ గౌడ్, బుర్కుంట నాగరాజు, పులిమామిడి శాలిని--శ్రీకాంత్ గౌడ్, పర్వతం వినోద్, లింగం సంధ్య--నవీన్, గూడెపు నీరజ--లక్ష్మణ్, కర్రె అఖిల--గణేష్ అలాగే మహిళా సంఘాల నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ నాయకులు తొంట అశోక్, రక్షిత్ గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మోదీ 12 ఏళ్ల పాలన విజయోత్సవం

## - నార్సింగి ఆలయంలో ప్రత్యేక పూజలు

## - మోదీ నాయకత్వంలో భారత్ విశ్వగురువైపు పయనం

గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )

దేశాభివృద్ధి, సంక్షేమం, సుశాసనానికి ప్రతీకగా నిలిచిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల విజయవంతమైన పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నార్సింగి శివాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోదీ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని, దేశం మరింత అభివృద్ధి సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, దేశ సేవలో ఆయన చూపుతున్న అంకితభావానికి కృతజ్ఞతలు తెలిపారు. మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ వేదికపై మరింత శక్తివంతమైన, ఆత్మనిర్భరమైన దేశంగా ఎదుగుతోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొక్క బాల్ రెడ్డి, అంజన్ కుమార్ గౌడ్, దిలీప్ ఆచార్య, లక్ష్మీనారాయణ, నాగేష్, అమర్ సింగ్, సత్యనారాయణ, శివాజీతో పాటు పలువురు భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దేశసేవలో మోదీ కృషిని కొనియాడిన హైదర్‌గూడ ప్రజలు



గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గత 12 సంవత్సరాలుగా దేశానికి అందిస్తున్న సేవలకు కృతజ్ఞతగా, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ హైదర్‌గూడ డివిజన్‌లోని పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రధానమంత్రి దీర్ఘాయుష్షు, దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం మరియు భారతదేశ సమగ్ర ప్రగతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తిపూర్వక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. దేశాభివృద్ధికి ప్రధానమంత్రి చేస్తున్న కృషిని కొనియాడుతూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకు మాత్రమే

## రౌడీలు, గూండాల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం - గంజాయి సాగు చేస్తే రైతు సంక్షేమ పథకాలు నిలుపుదల

### సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం - రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ స్పష్టీకరణ

**ఆదిలాబాద్,జూన్ 10 (( హైదరాబాద్ మిర్రర్**

కీలక మార్పులకు సంకేతాలు ఇస్తూ డీజీపీ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అనే పేరుతో నేరస్తుల పట్ల సానుభూతి ఉండదని, ప్రజలను గౌరవిస్తాం.. కానీ రౌడీలు, గుండాలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా అంతమైందన్నారు. ఈ నేపథ్యంలో గ్రేహౌండ్స్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తూ, వారి సేవలను ఇతర కీలక రంగాల్లో వినియోగించ నున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని డీజీపీ పేర్కొన్నారు. వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందని ప్రస్తావించారు. గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ప్రధాన సవాల్‌గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని డీజీపీ ప్రశంసించారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ సైతం మారాల్సిన అవసరం ఉందని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక, ప్రజలకు భరోసా ఇచ్చే పోలీసింగ్ కొనసాగుతుంది. కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో..1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందువల్లే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

## ప్రజాస్వామ్యంలో వరుస విజయాలు అరుదు

### ప్రజానేతగా గుర్తింపు పొండం కూడా అరుదే

### వరుస విజయాలతో గుర్తింపు పొందిన మోడీ

**న్యూఢిల్లీ,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):**

ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల్లో విజయం సాధించడం, ప్రజానేతగా గుర్తింపు పొందడం అరుదైన విషయం. ఏ పార్టీ అయినా.. ఏ నేత సామర్థ్యానికైనా ఇదే గీటురాయి. అందుకే గెలుపు కోసం రాజకీయ పార్టీలన్నీ నానా తిప్పలు పడుతుంటాయి. రాష్ట్రాల్లో విజయం సాధించటానికే అనేక ధక్కామొక్కీలు తినాలి. ఇక దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడం ఆషామాషీ విషయం కానే కాదు. దేశ రాజకీయాల్లో రాణించడం, సమర్థ నాయకత్వం–సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఆషామాషీకాదు. ఒక్కసారి ఎలాగోలా గెలిచినా.. వరుసగా రెండోసారి గెలవడం అంత తేలిక కాదు. అలాంటిది వరుసగా మూడోసారి కూడా జయకేతనం ఎగరవేయటం అన్నది కేవలం మోడీకి మాత్రమే సాధ్యమయ్యింది. పుష్కరకాలంగా ప్రధానిగా కొనసాగిన తర్వాత కూడా.. ఇప్పటికీ దేశంలో అత్యంత ఆదరణ ఉన్న నేతగా మోడీ నిలిచారు. కొన్నాళ్ల క్రితమే అత్యధిక కాలం పదవిలో ఉన్న ప్రభుత్వాధినేతగా మోడీ రికార్డు సృష్టించారు. . ఇప్పుడు అత్యధిక కాలం పదవిలో ఉన్న ఎన్నికైన ప్రధానిగా కొత్త రికార్డును తన పేరున లిఖించుకున్నారు. కాంగ్రెసేతర ప్రధానుల రికార్డులన్నీ తన రెండో టర్మ్‌లోనే బద్దలు కొట్టిన మోడీ.. గతేడాది కాంగ్రెస్ ప్రధానుల రికార్డులు బద్దలు కొట్టే పని మొదలు పెట్టారు. మునుపటి ఏడాది ప్రధానిగా ఇందిర రికార్డు బ్రేక్ చేసిన మోడీ.. ఇప్పుడు నవ భారత నిర్మాత నెహ్రూ రికార్డును అధిగమించారు. నరేంద్ర మోదీ 2014 మే లో తొలిసారి, ఆ తర్వాత వరుస విజయాలతో నేరుగా ప్రజామోదం పొందారు. మోదీ సాధించిన ఈ ఘనతకు ఆయన నాయకత్వ పటిమ, దేశవ్యాప్తంగా ఆయనకు ఉన్న తిరుగులేని ప్రజాదరణెళి ప్రధాన కారణంగా చూడాలి. మోడీ హయాంలో దేశం దశాబ్దాల నాటి సంకీర్ణ రాజకీయాల అస్థిరత నుంచి బయటపడి పటిష్టమైన రాజకీయ సుస్థిరత వైపు అడుగులు వేసింది. ఈ సుస్థిరత వల్లే జీఎస్టీ లాంటి క్లిష్టమైన పన్ను సంస్కరణలు, డిజిటల్ ఇండియా విప్లవం, బ్యాంకింగ్ రంగ ప్రక్షాళన వంటి సంచలన నిర్ణయాలు సాధ్యమయ్యాయి. జాతీయ భద్రత విషయంలో రాజీలేని వైఖరిని ప్రదర్శిస్తూ ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి చరిత్రాత్మక నిర్ణయాలతో దేశ అంతర్గత రాజకీయ స్వరూపాన్ని మోడీ మార్చివేశారు. ఇపుడు ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నరేంద్ర మోడీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి 2014 మే 21 వరకు ఆ పదవిలో కొనసాగారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు 13 సంవత్సరాలకు పైగా గుజరాత్ రాష్ట్రానికి నాయకత్వం వహించారు. 2014 మే 26న భారతదేశ 14వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో లోక్‌సభలో పూర్తి మెజారిటీ సాధించిన తొలి కాంగ్రెసేతర నాయకుడిగా నరేంద్ర మోడీ నిలిచారు. ఆ తర్వాత, రెండు పూర్తి పదవీకాలాలు పూర్తి చేసి, వరుసగా మూడోసారి తిరిగి ప్రధానమంత్రి అయిన తొలి కాంగ్రెసేతర ప్రధానమంత్రిగా కూడా ఆయన చరిత్ర సృష్టించారు. 2014లో ఎన్డీఏ కూటమి ద్వారా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నరేంద్రమోడీ.. 2019 ఎన్నికల్లో బీజేపీ భారీగా సీట్లు సాధించడంతో సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2024 ఎన్నికల్లో బీజేపీ మెజారిటీకి అల్లంత దూరంలో ఆగిపోయింది. దీంతో మిత్ర పక్షాల అవసరం పడింది. చంద్రబాబు, నితీష్ కుమార్ సహకారంతో కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం ఎలా ఏర్పాటైనా.. ప్రభుత్వాధినేతగా మోడీ పేరు కాకుండా మరో ప్రత్యామ్నాయం గురించి ఎవరూ ఆలోచించకపోవడం.. ఆయన నాయకత్వ పటిమకు నిదర్శనంగా చూడాలి. మోడీ నెహ్రూ రికార్డును అధిగమించిన ఈ తరుణంలో.. నాటి నేటి పరిస్థితుల్ని బేరీజు వేస్తే.. చాలా తేడా కనిపిస్తోంది. దేశ జనాభా దగ్గర్నుంచీ రాజకీయ చైతన్యం వరకు ఎంతో మార్పొచ్చింది.

మొదటిపేజీ తరువాయి

# జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

### అక్కడి కి రావద్దంటే..

### మీ జాగీరా అనడంలో తప్పేముంది

### ఉత్తర,దక్షిణ్యాది విభేదాలు దేశానికి ప్రమాదకరం

### మీడియాతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**న్యూఢిల్లీ,జూన్ 10 ( హైదరాబాద్ మిర్రర్ ):**

జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇకపోతే ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని, అలా విభజన రేఖ గీయకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు. విభజనవాదం దేశానికి మంచిది కాదు. 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉంది. నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు. అలా అయితే, రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాలు మారాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోంది. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలి. తమ సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నా. అక్కడ పోటీ చేయాలని మా పార్టీ నేతలు కోరారు. నేనెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరు. ఈ దేశం నాది.. ఎక్కడికైనా వెళ్లవచ్చనే ఉద్దేశంతోనే జాగీర్ అనే పదం వాడా. రాష్ట్ర విభజనకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు.. చేసిన తీరునే వ్యతిరేకించా'అని పవన్ తెలిపారు.వీబీ–జీ రామ్ జీ పథకం కింద ఏపీకి కేంద్రం రూ.7,707.21 కోట్లు కేటాయించడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే మూడో అత్యధిక కేటాయింపును ఏపీ దక్కించుకుందన్నారు. ఉపాధి పనుల్లో పారదర్శకతతో పాటు సమర్థవంతమైన నిర్వహణకు ఇది నిదర్శనంగా అభివర్ణించారు. కేంద్రం ఇస్తున్న నిధులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తాయని, ప్రజల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

### పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై

### హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్,జూన్ 10 ( హైదరాబాద్ మిర్రర్ ):**

మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్‌ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఆర్‌ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు

### భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్: ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

### 'మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు' అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్

### చర్చల విషయంలో జాప్యం చేస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరిక

### అమెరికా హెలికాప్టర్ కూల్చివేతతో పెరిగిన ఉద్రిక్తతలు

**తెలంగాణ జూన్ 10సమయజ్యోతి:**

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్టకు చేరాయి. చర్చల ప్రక్రియలో ఇరాన్ జాప్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. "మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనం సృష్టిస్తున్నాయి. ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై మరిన్ని దాడులు చేసే అవకాశం ఉందని సంకేతాలను ఆయన ఇచ్చారు.బుధవారం 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందించిన ట్రంప్, "ఇరాన్ సైన్యం ప్రస్తుతం తీవ్ర అస్తవ్యస్త స్థితిలో ఉంది. వారి నౌకాదళం, వాయుసేనలు దాదాపుగా ఉనికి కోల్పోయాయి. చర్చలకు రావడంలో వారు ఇప్పటికే చాలా ఆలస్యం చేశారు, ఇప్పుడు దానికి తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదు" అని పేర్కొన్నారు.

# దేశాభివృద్ధికి మోదీ సేవలు చిరస్మరణీయం: బీజేపీ నేతలు

**గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )**

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, దేశ ప్రజల విశ్వాసంతో వరుసగా 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా సేవలందిస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వ ప్రయాణానికి కృతజ్ఞతగా ప్రేమవతిపేట గ్రామంలోని శ్రీ శ్రీ పాండురంగ శివ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, సంక్షేమం, సుశాసనంలో మోదీ సేవలను కొనియాడుతూ, ఆయనకు దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా ఇంచార్జ్ వైస్ శ్రీధర్, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, మైలార్ దేవ్‌పల్లి అధ్యక్షుడు వినయ్ రెడ్డి, సోల్కర్ రెడ్డి, కోరిని సదానంద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, సరిత రెడ్డి, వేణుగోపాల్, భవానీ దాస్, ఈశ్వర్, మురళీమోహన్, నారతం రెడ్డి, ఆగపల్లి నరసింహ, యాదగిరి యాదవ్, రఘు ముదిరాజ్, శశికాంత్, రూపేష్ శుక్ల, యాదయ్య, మధుసూదన్ రెడ్డి, నరసింహ, రాజిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



## మోదీ 12 ఏళ్ల పాలన విజయోత్సవం..

# కాటేదాన్‌లో ప్రత్యేక పూజలు

### - వికసిత భారత్ లక్ష్యానికి మోదీ నాయకత్వం స్ఫూర్తి:

### నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**గండిపేట్ : ( హైదరాబాద్ మిర్రర్ )**

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాటేదాన్ డివిజన్‌లో విజయోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్ ఆధ్వర్యంలో ప్రగతి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ లో ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో దేశసేవ కొనసాగించాలని ప్రార్థించారు. దేశ అభివృద్ధి, సుశాసనం, ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో మోదీ పాలన కీలక పాత్ర పోషించిందని నాయకులు పేర్కొన్నారు.అనంతరం విశ్వేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించి, వికసిత భారత్ నిర్మాణంలో మోదీ నాయకత్వం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్ధన్, బుచ్చిరెడ్డి, రావుల భాస్కర్, సంతు గౌడ్, నవారు మురళీధర్ రెడ్డి, బబ్లూ, వెంకటరమణ, కొవ్వకుల బాబు, పృథ్వీరాజ్, ఎన్ను శంకర్ రెడ్డి, శివ, గోపాల్ నాయక్, కుర్మయ్య, రాజు స్వామి, కిరణ్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భారతీరాజా మృతికి సిఎం రేవంత్ సంతాపం

**హైదరాబాద్,జూన్ 10 ( హైదరాబాద్ మిర్రర్ ):**

నటుడు, దర్శకుడు పద్మశ్రీ భారతీరాజా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేసిన భారతీరాజా దర్శకుడిగా, నటుడిగా విశేష ఖ్యాతి గడించారని ముఖ్యమంత్రి గారు గుర్తుచేసుకున్నారు. ఎన్నో వైవిధ్యభరితమైన, సందేశాత్మక చిత్రాలను వివిధ భాషల్లో తెరకెక్కించి భారతీయ చలనచిత్ర రంగానికి విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు. భారతీరాజా మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటని ముఖ్యమంత్రి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

# 25 నుంచి సర్ పక్రియ ప్రారంభం

### ఐటిని వినియోగించుకోవాలన్న కమిషనర్

**హైదరాబాద్,జూన్ 10 ( హైదరాబాద్ మిర్రర్ ):**

ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఐటి విరివిగా వాడుకోని ఓటరు నమోదు పక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి తప్పులకు తావివకుండా ఎస్ఐఆర్ పక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ÷ుధవారం ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా ఐటి వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఐటి సపోర్ట్ టీం, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ పక్రియలో ఐటి అంశం అత్యంత కీలకమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకొని ఎస్ఐఆర్ పక్రియను వేగవంతం, సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని, అంతేకాకుండా ఓటరు జాబితా రూపొందించడంలో పారదర్శకత ఉంటుందని తెలిపారు. అలాగే ఓటర్లు ఆన్ లైన్ ద్వారా తమ పేరును ఎన్యుమరేషన్ చేసుకోవడానికి లనీబిIస.Iఇతి.ణనీల.తిని వెబ్ సైట్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే విధంగా తెచ్చిందని, దీంతో ఎస్ఐఆర్ పక్రియ మరింత సులభతరం చేసేందుకు ఇందులో వివిధ టూల్స్ను పొందుపరిచిందని, వీటిని ఉపయోగించడంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్ లు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా ఓటర్లను ఎన్యుమరేషన్ చేసుకునేందకు సదుపాయం కల్పించినందున దీనిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఇఒ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ పక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు.

# ప్రతిపక్ష బాధలేని నెహ్రూ

**న్యూఢిల్లీ,జూన్10(( హైదరాబాద్ మిర్రర్ )( హైదరాబాద్ మిర్రర్ )):**

స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోడీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951-52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించిన నెహ్రూకు ఆ కాలంలో పెద్దగా జాతీయ స్థాయి ప్రతిపక్షం ఎదురుకాలేదు. ఆయన సెక్యులర్ ఐక్యత సిద్ధాంతంతో దేశాన్ని నడిపించారు.

# సుపరిపాలన అతిపెద్ద పరీక్ష
## ఎక్స్ వేదికగా మోడీ పోస్ట్

**న్యూఢిల్లీ,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):**

ప్రధాని నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. భారత్‌లో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోదీ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు' అని మోదీ రాసుకొచ్చారు. ఇక, ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు.

# సరికొత్త చరిత్ర లిఖించిన ప్రధాని నరేంద్ర మోడీ

**న్యూఢిల్లీ,( హైదరాబాద్ మిర్రర్ )**



న్యూఢిల్లీ అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా పదవిలో కొనసాగిన రికార్డు. 4,399 రోజుల పాటు పీఎంగా కొనసాగిన మోడీ. అంతకు ముందు నెహ్రూ పేరిట ఉన్న రికార్డు. నెహ్రూ 2014 మే 26న ఆయన తొలిసారిగా ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి నిరంతరాయంగా ప్రజలచే ఎన్నుకోబడిన ప్రధానిగా అత్యధిక కాలం పనిచేసిన వ్యక్తిగా నిలిచారు.జూన్ 10, 2026 నాటికి మోదీ నిరంతరాయంగా 4,399 రోజులు పదవిలో కొనసాగి, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించారు.ఎన్నుకోబడిన ప్రధానుల వరుస పదవీకాలం పరంగా, నెహ్రూ 4,398 రోజులు, ఇందిరా గాంధీ 4,077 రోజులు తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

# ప్రీ కిడ్స్ స్కూలు ప్రారంభించిన ఎంపి ఈటల

**ఎల్బీ నగర్( హైదరాబాద్ మిర్రర్ )**



చంపాపేట్ డివిజన్లో నిర్వహించిన 9 లండన్ ప్రీ కిడ్స్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్లే -స్కూల్స్ కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సమా రంగారెడ్డి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సిద్ధాంత్, నూతి శ్రీనివాస్ , పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిత్రపరిశ్రమ గొప్ప దర్శకుడిని కోల్పోయింది
## నటి ఖుష్బూ సుందర్ భావోద్వేగ పోస్ట్

**చెన్నై,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):**

లెజెండరీ దర్శకుడు భారతీరాజా మరణ వార్తతో దక్షిణాది సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు. భారతీరాజాతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగ సందేశాలు పంచుకుంటున్నారు. ఈ క్రమంలో సీనియర్ నటి కుష్బూ చేసిన సోషల్ మీడియా పోస్ట్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. భారతీరాజా మరణం తనను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురి చేసిందని ఆమె పేర్కొన్నారు. తమిళ సినీ పరిశ్రమ ఒక గొప్ప దర్శకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పోస్ట్‌లో కుష్బూ మాట్లాడుతూ.. మనందరికీ ఎంతో ఇష్టమైన దర్శకుడు భారతీరాజా ఇక లేరనే వార్త నమ్మలేకపోతున్నాను. ఆయన మరణం తమిళ సినీ పరిశ్రమకు తీరని లోటు. ఆయన రూపొందించిన సినిమాలు ఒక ప్రమాణంగా నిలిచాయి. భవిష్యత్తులో వచ్చే తరాల దర్శకులకు, సినిమా ప్రేమికులకు ఆయన చిత్రాలు ఒక మార్గదర్శకంగా నిలుస్తాయి' అని పేర్కొన్నారు. భారతీరాజాతో తనకు ఉన్న ఓ మధుర జ్ఞాపకాన్ని కూడా కుష్బూ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నన్ను రెండు జడలతో చూపిస్తూ ఒక అందమైన సినిమా చేయాలని ఆయన ఎప్పుడూ చెప్పేవారు. ఆ ప్రాజెక్ట్ గురించి చాలాసార్లు మాట్లాడేవారు. కానీ ఇప్పుడు ఆ కల ఇక ఎప్పటికీ నెరవేరని కలగానే మిగిలిపోయింది అంటూ భావోద్వేగానికి గురయ్యారు. కుష్బూ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అభిమానులు కూడా ఆమె పోస్ట్‌కు స్పందిస్తూ భారతీరాజా గురించి తమ జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. గ్రామీణ నేపథ్య కథలకు కొత్త అర్థం చెప్పిన దర్శకుడిగా భారతీరాజా ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రేమ, కుటుంబ బంధాలు, మానవ సంబంధాలను అత్యంత సహజంగా వెండితెరపై ఆవిష్కరించిన ఆయన చిత్రాలు తరతరాల ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. భారతీరాజా మరణంతో ఒక గొప్ప దర్శకుడి యుగానికి ముగింపు పలికినట్లైందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఆధునిక భారతం ఆవిష్కరించిన నెహ్రూ
## ప్రజాస్వామ్య హత్యకు మోడీ సారథ్యం -12 ఏళ్ల సుదీర్ఘ పాలనపై జైరామ్ రమేశ్ ఎద్దేవా

**న్యూఢిల్లీ,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):**

ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. ఎన్నికైన ప్రధానుల్లో నిరంతరాయంగా సుదీర్ఘకాలం కొనసాగిన నేతగా మోదీ రికార్డు సృష్టించారు. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ స్పందిస్తూ మోదీపై విమర్శలు గుప్పించింది. ఆయన స్వయంప్రకటిత మైలురాయిని దాటారేమో కానీ, దేశానికి పెద్ద సమస్యగా పరిణమించారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. మోదీ పాలనకు కాకుండా దేశంలో ప్రజాస్వామ్య హత్యకు సారథ్యం వహిస్తున్నారని అన్నారు. 1947 ఆగస్టు 15న జవహర్‌లాల్ నెహ్రూ ఒక అద్భుతమైన మంత్రివర్గానికి అధ్యక్షత వహించి.. భారత ప్రధాని అయ్యారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అరుదైన ఆ మంత్రివర్గం పాలనలో ఐదేళ్లలోనే ఆధునిక భారతం ఆవిర్భవించిందన్నారు. 560కి పైగా రాచరిక రాష్ట్రాలను శాంతియుతంగా భారత యూనియన్‌లో విలీనం చేశారని.. భారత రాజ్యాంగాన్ని ఆమోదించారని అన్నారు. దేశంలోని జమీందారీ వ్యవస్థ రద్దు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు, నీటిపారుదల ప్రాజెక్టులు వంటి నిర్ణయాలతో దేశం ప్రపంచ వ్యవహారాల్లో ఒక శక్తిగా ఆవిర్భవించిందన్నారు. 1947-52 మధ్య నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశం నెలకొల్పిన రికార్డులను మోదీ చరిత్ర నుంచి చెరిపేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. 1952, 1957, 1962 ఎన్నికల్లో నెహ్రూ భారీ మెజారిటీతో విజయం సాధించగా.. 2024లో మోదీకి కనీస మెజారిటీ కూడా రాలేదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ప్రధాని కావడానికి ఎన్డీఏ నేతలకు తాయిళాలు ఇచ్చి మద్దతు కూడగట్టుకోవాల్సి వచ్చిందన్నారు. మోదీ పరిపాలనలో స్వతంత్ర ఎన్నికల సంఘం, పవిత్రమైన ఓటర్ల జాబితా వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలు ముప్పులో పడ్డాయన్నారు. పేపర్ లీక్‌ల కుంభకోణాలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ఎన్నో ప్రభుత్వ ఆస్తులను కొందరు ధనవంతుల పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు ఇతర వెనకబడిన తరగతులకు కల్పించిన రిజర్వేషన్లను బలహీనపరుస్తున్నారని విమర్శించారు.



# సుపరిపాలన అతిపెద్ద పరీక్ష
## మీనాక్షి స్థానంలో మహేశ్ కేవత్ -అనూహ్యంగా బిజెపికి కలిసి వచ్చిన అవకాశం
## మీనాక్షిపై కేసు తెలంగాణ నేతలే ఉప్పందించారు- బిజెపి మంత్రి సంచలన వ్యాఖ్యలు

**భోపాల్,జూన్10( హైదరాబాద్ మిర్రర్ ):**

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో.. బీజేపీ విజయానికి మార్గం సుగమమైంది. ఆ రాష్ట్రంలో మూడో అభ్యర్థిగా మహేశ్ కేవత్‌కు అవకాశం కల్పించిన బీజేపీ.. ఏకగ్రీవంగా విజయం సాధించి మూడు రాజ్యసభ స్థానాల్లోనూ క్లీన్ స్వీప్ చేయడం దాదాపు ఖాయమైంది. మరో ఇద్దరు అభ్యర్థులైన తరుణ్ చుగ్, రజనీశ్ అగర్వాల్‌ల ఎన్నికను ఖరారు చేసేందుకు ఆ పార్టీకి శాసనసభలో తగినంత మద్దతు ఉంది. దీంతో రాష్ట్ర రాజ్యసభ ఎన్నికల్లో అధికార పార్టీ సంపూర్ణ విజయాన్ని కైవసం చేసుకోనుంది.ఈ నేపథ్యంలో మహేశ్ కేవత్ రాజకీయ నేపథ్యం ఏమిటో ఓసారి పరిశీలిస్తే.. ఆయనో సీనియర్ బీజేపీ నేత. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో పాటు బీజేపీ సంస్థాగత నెట్‌వర్క్‌తో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది. చిన్నప్పటి నుంచే ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం కలిగి ఉన్న కేవత్.. అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ , బీజేపీ యువజన విభాగంలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా మంత్రిగానే కాకుండా సంఘ్ పరివార్‌లోనూ వివిధ హోదాల్లో పనిచేశారు. అంతేకాకుండా.. రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గానూ సేవలందించారు. ఆ రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్, కేవత్ సామాజిక నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ.. హిందూ పురాణాలలో పూజ్య పురుషుడైన నిషాద్ రాజ్ వారసత్వ కొనసాగింపునకు ఆయన నామినేషన్ నిదర్శనమని పేర్కొన్నారు. నటరాజన్ నామినేషన్ పత్రాలలో అనేక లోపాలున్నాయని, కొన్ని వివరాలను ఆమె దాచిపెట్టారని బీజేపీ ఆరోపించింది. తెలంగాణలోని ఓ కోర్టులో ఆమెపై ఉన్న పెండింగ్ కేసు విషయాన్ని వెల్లడించలేదనేది ఆ పార్టీ లేవనెత్తిన కీలక అభ్యంతరాలలో ఒకటి. పరిశీలన ప్రక్రియలో ఎన్నికల అధికారులు అభ్యంతరాలను స్వీకరించడంతో ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో రాజ్యసభ పోటీలో కాంగ్రెస్ సవాలుకు దాదాపుగా తెరపడినట్టు సమాచారం. అయితే కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు కైలాష్ విజయ్ వర్గియా సంచలన వ్యాఖ్యలు చేశారు. మీనాక్షీనటరాజన్ మీద తెలంగాణలో కేసుల గురించి టీ కాంగ్రెస్ నేతలే తమకు సమాచారం ఇచ్చారని బాంబు పేల్చారు. ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. 'అసలు మీనాక్షీనటరాజన్ మీద తెలంగాణలో కేసు నమోదైనట్టు మాకు తెలియనే తెలియదు. తెలంగాణ కాంగ్రెస్ నుంచే ఆ సమాచారం మాకు వచ్చింది. అక్కడి కాంగ్రెస్ పార్టీ నేతలే మాకు ఈ సమాచారం ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. అక్కడి నుంచే మాకు ఈ కేసు పత్రాలొచ్చాయి. దీనిని బట్టి కాంగ్రెస్‌లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోండి' అని వ్యాఖ్యానించారు. మొత్తంగా కైలాష్ విజయ్ వర్గియా వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో పెను ప్రకంపనలకు దారితీశాయి. మీనాక్షికి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా, బీజేపీకి అనుకూలంగా కొందరు టీ కాంగ్రెస్ నేతలు కోవర్ట్ రాజకీయాలు నడుపుతున్నారని ఇప్పటికే కొన్ని వార్తలొచ్చాయి. కైలాష్ వర్గియా వ్యాఖ్యలు ఇందుకు మరింత బలాన్ని చేకూర్చాయని పలువురు కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

# పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక
## గ్రామసభలను బలోపేతం చేసి ఆదివాసీ గిరిజన హక్కులను కాపాడాలి: మంత్రి సీతక్క
## రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ప్రారంభం



షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామసభల సాధికారత, స్థానిక స్వపరిపాలన బలోపేతం, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు పీసా (ఖుఅఎష్టుఋఎం జుఞవఅంఅశీఅ ^శీ ూఎష్ట్రవఎబశ్రీవఎ ూఅతీఱఎుం ూఎషీ) చట్టం అత్యంత కీలకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అన్నారు. పీసా చట్టంపై అవగాహన లోపాలు ఇంకా కనిపిస్తున్న నేపథ్యంలోనే అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పీసా కోఆర్డినేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సమగ్ర శిక్షణ అవసరమనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తు న్నామని తెలిపారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ లో "షెడ్యూల్డ్-ఎ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ సంస్థల బలోపేతంలో పీసా చట్టం పాత్ర" అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. జూన్ 10, 11 తేదీల్లో జరుగుతున్న ఈ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, పీసా మొబిలైజర్లు, కోఆర్డినేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావుల బృంద సభ్యులు కలిపి 70 మంది పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, పీసా చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది ఆదివాసీల ఆత్మగౌరవానికి, స్వయం నిర్ణయాధికారానికి, సహజ వనరులపై హక్కులకు రాజ్యాంగబద్ధమైన రక్షణ అని అన్నారు. దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని భూములు, అడవులు, జల వనరులు, ఖనిజ సంపదలపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించినప్పటికీ, చట్టం అమలులో అనేక సవాళ్లు ఉన్నాయని చెప్పారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సహజ వనరులు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు."పెద్ద పెద్ద సంస్థలు ప్రజలను నిరాశ్రయులను చేసే పరిస్థితులను పీసా చట్టం అంగీకరించదు. కానీ ఆ హక్కుల గురించి ఎంతమందికి అవగాహన ఉంది అనేది ప్రశ్న. అధికారులు పనిచేసే అంశంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుంది" అని మంత్రి అన్నారు.సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించేలా పీసా చట్టం అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. గ్రామసభలే స్థానిక ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని, వాటిని మరింత శక్తివంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.తాను ఉద్యమాల నుంచి వచ్చిన వ్యక్తినని, ఆదివాసీ ప్రాంతాల్లో పెరిగి అక్కడి సమస్యలను దగ్గరగా చూసిన వ్యక్తిగా గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు దక్కడం తనకు గర్వకారణమని, ఆ అవకాశాన్ని సమాజానికి మేలు చేసే దిశగా వినియోగించుకోవాలనే సంకల్పంతో పనిచేస్తున్నానని తెలిపారు.తన జీవిత ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, ఆదివాసీ హక్కుల కోసం పనిచేసే యాక్షి సంస్థతో కలిసి పనిచేసిన రోజులను మంత్రి గుర్తు చేసుకున్నారు. ఆ సంస్థ తనకు ఉద్యోగావకాశం కల్పించి, న్యాయ విద్యను పూర్తి చేసుకునేందుకు తోడ్పాటునిచ్చిందని చెప్పారు."మనం ఉన్నవారి కోసం కాకుండా, లేని వారి కోసం పనిచేయాలి. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రజాసేవ యొక్క అసలు ఉద్దేశ్యం" అని మంత్రి పేర్కొన్నారు.హైదరాబాద్ అభివృద్ధి, అడవుల్లోని ఆదివాసీ గ్రామాల పరిస్థితుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ, ఇప్పటికీ అనేక గిరిజన ఆదివాసి ప్రాంతాల్లో ప్రాథమిక సదుపాయాల కొరత ఉందన్నారు. మరోవైపు సహజ వనరులు క్షీణిస్తున్నాయని, గుట్టలు కరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలు, గ్రామసభలను బలోపేతం చేయడం అత్యవసరమని చెప్పారు.వర్క్‌షాప్‌లో పాల్గొంటున్న ప్రతినిధులు తమ అనుభవాలు, సూచనలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకోవాలని మంత్రి కోరారు. ఈ చర్చల ద్వారా పీసా అమలులో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కార మార్గాలు రూపొందుతాయని, ఆదివాసీ గిరిజన హక్కుల పరిరక్షణకు మరింత బలమైన విధానాలు రూపొందించేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సర్పంచుల కోసం రూపొందించిన "సర్పంచ్ సంవాద్" డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రస్తావించిన మంత్రి, దేశవ్యాప్తంగా అవార్డులు అందుకున్న ఈ యాప్ ద్వారా తెలంగాణలోని 4,500 మంది సర్పంచులు పరస్పరం ఉత్తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి ఒకే వేదికపై చర్చించే అవకాశం లభిస్తుందని తెలిపారు. సాంకేతికతను వినియోగించి గ్రామీణ పాలనను మరింత సమర్థవంతంగా మార్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీసా చట్టం అమలు పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని, గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పిస్తూ ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# ప్రకృతి ప్రేమికుడు భారతీరాజా


## పల్లె అందాలకు చిత్రాల్లో పెద్దపీట



ప్రకృతిని ప్రేమించడం..అనుభవించడం..ఆస్వాదించడం..ఆనందించడం అందరికీ తెలుసు. కాన ఈప్రకృతి రమణీయకతను సెల్యూలాయిడ్‌పై చూపి ప్రేక్షకులను రంజిపం చేయడం కొందరికే తెలుసు. అందులో ముందుంటారు దర్శకలు భారతీరాజా. ఆయన తీసిన చిత్రలే అందుకు నిదర్శనం. భారతీయ సినీ ప్రపంచంలో గ్రామీణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దర్శకుడు ఆయన పల్లె అందం, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి అనుబంధాలు – ఆనందాలు, బాధలు – భావోద్వేగాలను ఎంతో సహజంగా వెండితెరపై ఆవిష్కరించడంలో ఆయన తరవాతే ఎవరైనా. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా మట్టివాసనతో నిండిన ఓ జీవనరాగంలా అనిపిస్తుంది. ప్రేమను కవిత్వంగా, బంధాలను హృద్యంగా, ప్రకృతిని పాత్రగా మలిచిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. భావోద్వేగాలకు దృశ్యరూపమిచ్చిన ఓ గొప్ప కథకుడుగా ఆయన చిత్రసీమలో నిలిచి పోయారు. భారతీరాజా భౌతికంగా దూరమయినా, ఆయన తీసిన మణిపూసల్లాంటి చిత్రాలు నిరంతరం మన మనసులను తడుతూనే ఉంటాయి. కన్నడ దర్శకుడు పుట్టణ్ణ కనగల్, పి.పుల్లయ్య వంటి దిగ్గజాల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమాలో మెళకువలు నేర్చుకున్నారు. అలా ఆయన పరిశ్రమలోకి అడుగుపెట్టారు.భారతీరాజా తన సినిమాల్లో ఎక్కువగా పల్లెటూరి కథలనే చూపించేవారు. మట్టివాసనను వెండితెర పైకి తెచ్చిన దర్శకుడిగా ఆయనకు పేరుంది. హీరోయిన్లను మేకప్ లేకుండా స్వచ్ఛంగా చూపించేవారు. దీని వెనుక కారణాన్ని ఆయన ఓ సందర్భంలో తనదైన చతురతను జోడించి చెప్పారు. 'ప్రకృతికాంత' అందానికి ముగ్ధుడినయ్యా. అందుకే కెమెరా పట్టుకుని ఆ అందాన్ని వెతుక్కుంటా అంటూ పల్లెలపై తన ప్రేమను వ్యక్తపర్చారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ అయ్యింది) సినిమాతో భారతీరాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. అప్పటివరకు కేవలం స్టూడియో సెట్టింగులకే పరిమితమైన తమిళ సినిమాను నిజమైన పల్లెటూరి లొకేషన్లలోకి తీసుకెళ్లి సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. ఎలాంటి మేకప్ లేకుండా హీరోలను చూపించడం, ఎలాంటి అదనపు సొగసుల జోలికి వెళ్లకుండా సహజంగా ఉన్న అమ్మాయిలను హీరోయిన్లుగా పరిచయం చేయడంతో అప్పటి సినీ సంప్రదాయాలను తిరగరాశారు. కేవలం గ్రామీణ చిత్రాలకే పరిమితం కాకుండా, 'సిగప్పు రోజాక్కల్' (తెలుగులో ఎర్ర గులాబీలు) వంటి సైకో థ్రిల్లర్ చిత్రాలతో తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. తెలుగులో ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' (1981) చిత్రం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన తీసిన 'వేదం పుదిదు' సినిమా సమాజంలో పెద్ద చర్చకు దారితీసింది. రాధిక, రాధ, రేవతి, కార్తీక్, విజయశాంతి వంటి ఎందరో నటీనటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. భారతీరాజా ప్రతిభకు ఎన్నో అవార్డులు దాసోహమన్నాయి. ఆయన తన కెరీర్‌లో దాదాపు 40 చిత్రాలకు దర్శకత్వం వహించి, 'ఇయక్కునార్ ఇమయం (దర్శక శిఖరం)' అనే బిరుదును పొందారు. జాతీయ అవార్డులు: వివిధ విభాగాల్లో మొత్తంగా 6 జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. ఇందులో తెలుగు చిత్రం 'సీతాకోకచిలుక'కు ఉత్తమ ప్రాంతీయ చిత్ర అవార్డు కూడా ఉంది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ 2004లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. వీటితో పాటు 4 ఫిలింఫేర్ అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు, నంది అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. ఆయన కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా నటుడిగానూ అలరించారు. 'ఆయుధ ఎళుతు', 'పాండియనాడు', 'తిరుచిత్రంబలమ్' (తిరు), గతేడాది వచ్చిన విజయ్ సేతుపతి 'మహారాజా' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించారు. మోహన్‌లాల్ 'తుడరుమ్'లో చివరిసారి తెరపై కనిపించారు. అలాగే ఆయన నటించిన 'పులవర్' చిత్రం ఇంకా విడుదల కావాల్సిఉంది. భారతీరాజా తర్వాతితరం చిత్రనిర్మాతల కు శిక్షణ ఇవ్వడానికి 'భారతీరాజా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సినిమా'ని స్థాపించారు.

# కలెక్షన్లలో దూసుకెళుతున్న పెద్ది

## రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుంటున్న ఈ చిత్రం వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో క్రీడలు, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, పోరాట స్ఫూర్తి వంటి అంశాలను దర్శకుడు బుచ్చిబాబు సాన ఆకట్టుకునే విధంగా చూపించారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.218.50 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పూర్తిస్థాయి విజయాన్ని నమోదు చేయాలంటే దాదాపు రూ.220 కోట్ల షేర్ వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే గ్రాస్ పరంగా రూ.440 కోట్ల మార్క్‌ను అందుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు రూ.332 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన నేపథ్యంలో బ్రేక్ ఈవెన్ చేరుకోవడానికి మరో రూ.108 కోట్ల గ్రాస్ అవసరమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 'పెద్ది' ఇప్పటికే బ్రేక్ ఈవెన్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.




# దసరాకు షిఫ్ట్ అయిన టాక్సిక్ విడుదల

## చిత్ర వర్గాల్లో బలమైన టాక్

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో 456భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బ్జడెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సమాచారం ప్రకారం 'టాక్సిక్' సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా అక్టోబర్ తొలి వారం లేదా మూడో వారంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు కన్నడ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది.

# తండ్రికి తగ్గ తనయుడిగా బాలకృష్ణ

## బాలకృష్ణ జన్మదినోత్సవం - అభినందనలు తెలిపిన ప్రముఖులు



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నటసింహం నందమూరి బాలకృష్ణ నటప్రస్థానం ఒక అద్భుతం. ఆయన జన్మదినం సందర్భంగా చిత్ర ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగుతున్న బాలయ్య కెరీర్‌లో ఎన్నెన్నో అపూర్వ విజయాలు, మరెవరికీ సాధ్యంకాని రికార్డులు. వసూళ్ల పరంగానే కాదు, థియేటర్లలో అత్యధిక రోజులు ప్రదర్శించబడిన సినిమా కూడా బాలయ్య పేరుతోనే ఉంది. బాలకృష్ణ పని అయిపోయింది అని విమర్శకులు భావించిన ప్రతిసారీ మాస్ కంబ్యాక్ ఇవ్వడమే కాదు బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త రికార్డులతో విమర్శకుల నోళు మూయించాడు. మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు ఐదవ కుమారుడిగా 1960 జూన్ 10న బాలకృష్ణ జన్మించారు. తండ్రి నేర్పిన అపారమైన వృత్తి నిబద్ధత, క్రమశిక్షణ, తల్లి బసవరామతారకం అందించిన ప్రేమానురాగాలు బాలయ్యను ఒక విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దాయి. ఓవైపు బడిలో పాఠాలు చదువుకుంటూనే 1974లో ఎన్టీఆర్ నటించిన తాతమ్మకల సినిమా ద్వారా వెండితెరకు పరిచయం అయ్యాడు బాలయ్య. అన్నదమ్ముల అనుబంధం, వేములవాడ భీమకవి, దానవీరశూరకర్ణ, శ్రీమద్విరాటపర్వము, శ్రీతిరుపతి వేంకటేశ్వర కళ్యాణం, రౌడీరాముడు-కొంటె కృష్ణుడు, అనురాగదేవత, సింహం నవ్వింది, శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర' వంటి చిత్రాలలో తండ్రి న్టీఆర్ తో కలిసి నటించి మెప్పించాడు బాలయ్య. 1984లో సాహసమే జీవితం సినిమాతో సోలో హీరోగా మారారు. కానీ ఆ సినిమా ఆశించినంతగా ఆడలేదు. తొలిమూడు సినిమాలు ఫ్లాప్ అవడంతో బాలయ్యపై విమర్శలు వచ్చాయి. కానీ నాలుగవ సినిమాగ వచ్చిన మంగమ్మగారి మనవడు'తో బాలయ్య తన పవర్ ఏంటో చూపించాడు. ఆ సినిమా ఏకంగా 565 రోజులు ఆడి రికార్డులు క్రియేట్ చేసింది.



# ఆల్ఫా టీజర్ విడుదల

## భారీ యాక్షన్ సీన్లఓ కొత్తగా ఆలియా భట్

యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్‌÷ట్లు, ÷టింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది.మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889